క్లుప్తంగా

మర్యాదపూర్వక కలయిక



తలే రాజేష్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్న జగదీష్

రాజాం : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆర్‌టీఐ విభాగ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన జద్దు జగదీష్ శుక్రవారం రాజాంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ తలే రాజేష్‌ను కలిశారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి తనపై ఉంచిన నమ్మకానికి తగ్గట్టుగా పనిచేస్తామని తెలిపారు. జగదీష్ పాగిరి పంచాయతీ సర్పంచ్‌గా గతంలో పనిచేశారు.

సామూహిక సెలవు



వినతిపత్రం అందిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

సంతకవిటి: తామంతా శనివారం సామూహిక సెలవు పెడుతున్నట్లు పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీఓ కె.సురేష్‌కుమార్‌కు శుక్రవారం వినతిపత్రం అందించారు. పనిఒత్తిడి, రేషనలైజేషన్‌లో కొన్ని పంచాయతీల్లో కార్యదర్శులకు స్థానం చూపించక పోవడం తదితర అంశాలపై రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు మండలంలోని కార్యదర్శులందరం సామూహిక సెలవు పెడుతున్నట్లు పంచాయతీ కార్యదర్శులు స్పష్టం చేశారు.

మొక్కలతో ఆహ్వానం

రాజాం: మండలంలోని పెనుబాక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులకు అక్కడి ఉపాధ్యాయులు, విద్యార్థులు శుక్రవారం మొక్కలు అందజేసి వినూత్నంగా స్వాగతం పలికారు. వాటిని పాఠశాల ఆవరణలో నాటి వాటి పెంపకం బాధ్యత విద్యార్థి సంఘాలకు అప్పగించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మహేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

రక్షిత పథకాల్లో క్లోరినేషన్ చేయించాలి



తోకలవలస మంచినీటి పథకం వద్ద అధికారులకు సూచనలిస్తున్న ఎంపీడీఓ శ్యామలాకుమారి

రేగిడి: మండలంలోని ప్రతి గ్రామంలో ఉన్న తాగునీటి రక్షిత పథకాల్లో విధిగా క్లోరినేషన్ చేయించాలని కార్యదర్శులు, సర్పంచ్‌లకు ఎంపీడీఓ శ్యామలాకుమారి సూచించారు. ఈ మేరకు శుక్రవారం ఆమె మండలంలోని తోకలవలస వాటర్ ట్యాంకును పరిశీలించారు. ఈ సీజన్‌లో పరిశుభ్రమైన తాగునీరు అందేలా చూడాలని కోరారు. కలుషిత నీరు అందితే వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ప్రతి పంచాయతీ సర్పంచ్, కార్యదర్శి తాగునీటి వనరుల వద్ద పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు.

బైక్ ఢీకొని మహిళకు గాయాలు

బొబ్బిలి రూరల్: మండలంలోని మెట్టవలస గ్రామానికి చెందిన సారిక అప్పలరాము అనే మహిళను బైక్ ఢీకొట్టడంతో తీవ్రంగా గాయాలయ్యాయి. శుక్రవారం మెట్టవలస నుంచి పారాది గ్రామానికి పల్ల అప్పలనాయుడితో కలిసి మోటార్‌సైకిల్‌పై ఆమె వెళ్తుండగా గరివిడికి చెందిన ఆవుల అప్పన్న, యాగోటి రవిలు మద్యం మత్తులో వెనుకనుంచి బైక్‌తో ఢీకొట్టారు. దీంతో రోడ్డుపై పడిపోయిన అప్పలరాముకు తీవ్ర గాయాలు కాగా స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. ప్రమాదానికి కారణమైన ఇద్దరు యువకులను పోలీసులకు అప్పగించారు.

ఉపాధ్యాయులు బాధ్యతగా బోధించాలి



ఆరో తరగతి బ్రిడ్జ్ కోర్సు పుస్తకాలు పరిశీలిస్తున్న డిప్యూటీ ఈవో మోహనరావు, డైట్ బృందం

రామభద్రపురం: ఉపాధ్యాయులు అలసత్వం వీడి బాధ్యతగా పాఠాలు బోధించాలని డిప్యూటీ ఈవో కె.మోహనరావు సూచించారు. డైట్ బృందం సభ్యులు డి.శ్రీనివాసరావు, కె.అన్నారావులతో ఆయన స్థానిక ఉన్నత పాఠశాలతో పాటు పలు ప్రాథమిక పాఠశాలలను శుక్రవారం సందర్శించారు. వారు పాఠశాలల్లో పలు తరగతి గదులల్లో విద్యార్థుల హాజరు శాతం, ఆరో తరగతిలోని పిల్లలకు ఇచ్చిన బ్రిడ్జ్ కోర్సుకు సంబంధించిన వర్క్‌బుక్‌లను పరిశీలించారు. అవి కరక్షన్స్ చేసి లేకపోవడాన్ని చూసి ఎందుకు కరక్షన్ చేయలేదని సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్పటికీ టైమ్‌టేబుల్ ప్రకారం తరగతులు నిర్వహించకపోవడం, పిల్లల హాజరు శాతం తక్కువగా ఉండడంతో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అన్ని తరగతులలో బెంచీలు లేక పిల్లలు నేలపై కూర్చోవడంతో బెంచీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ప్రతి తరగతి గదిలో టైమ్ టేబులతో పాటు ఏరోజుకారోజు పిల్లల హాజరు, గైర్హాజరు సంఖ్యను బోర్డుపై రాయాలని తెలిపారు.

వెనకబడిపోయాం!

- ప్రభుత్వ పాఠశాల్లో ప్రవేశాలు శూన్యం
- వేసవిలో చేపట్టాల్సిన స్పెషల్ డ్రైవ్..జూన్‌లో..
- కానరానికి విద్యార్థుల చేరికలు
- చేరిన చోట కూడా ఒకరిద్దరే..
- గతంతో పోలిస్తే ప్రభుత్వ బడుల్లో తగ్గిన అడ్మిషన్లు



నాయుడువలస ప్రాథమికోన్నత పాఠశాల

రామభద్రపురం: విద్యారంగంలో పేద ప్రజలకు ఉపయోగపడే సంస్కరణలు తీసుకొస్తున్నాం.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు సంఖ్య భారీగా పెంచుతున్నామని కూటమి ప్రభుత్వం చెబుతున్నా వాస్తవానికి క్షేత్రస్థాయిలో పరిస్థితి దానికి భిన్నంగా ఉంది. గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంతో పోలిస్తే ప్రస్తుతం ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల చేరికలు విపరీతంగా తగ్గిపోయాయి. అప్పట్లో అమ్మఒడి పథకం అందించి, చదువుకు ఆర్థికసాయం చేయడంతో ప్రతి ప్రభుత్వ బడిలో పిల్లలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించారు. దీంతో అప్పుడు పాఠశాలల్లో చేరికలు గణనీయంగా పెరిగాయి. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా చతికిలపడింది. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది గడిచింది.. వేసవి సెలవుల తర్వాత పాఠశాలల పునఃప్రారంభం కూడా జరిగింది. అయితే ఇంతవరకు ఏ పాఠశాలల్లోనూ ఒకటో తరగతిలో ప్రవేశాలు జరిగినట్లు దాఖలాలు కనిపించడం లేదు. దీనంతటికీ కూటమి సర్కారు.. ప్రభుత్వ విద్యపై నిర్లక్ష్యం వహించడమే కారణమనే విమర్శలు వెలువడుతున్నాయి.

తొమ్మిది రకాల పాఠశాలలు..

అధికార కూటమి ప్రభుత్వం.. ఈ విద్యా సంవత్సరం నుంచే తొమ్మిది రకాల పాఠశాలలను అందుబాటులోకి తెచ్చింది. ఈ మేరకు ప్రతి పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరగాలని, ఇందుకు ఉపాధ్యాయులు, సీఆర్‌ఎంటీలు, ఎస్‌ఎంసీ సభ్యులంతా సమన్వయంతో స్పెషల్ ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ పేరిట గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి బడి ఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని మార్గదర్శకాలు జారీ చేసింది. అయితే ఇది కొన్నిచోట్ల కాస్త నత్తనడకన సాగుతుండగా, చాలా పాఠశాలల పరిధిలో ఈ డ్రైవ్ కనిపించడం లేదు. ఫలితంగా పిల్లలు ప్రైవేటు పాఠశాలలకు వెళ్లిపోతున్నారన్న ఆరోపణలు పలువురు చేస్తున్నారు. మే నెలలో పూర్తి చేయాల్సిన ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ ఇప్పుడు చేస్తే ఎలా..? ప్రభుత్వం.. అధికార యంత్రాంగం ఇలా నిర్లక్ష్యంగా ఉంటేనే పరిస్థితి అలా ఉంటుందని పలువురు విమర్శిస్తున్నారు.

గందరగోళ పరిస్థితి..

ఒకే ఏడాదిలో కొత్త పాఠశాలల అమలు, విద్యార్థుల తరలింపులు, చేరికలు, ఉపాధ్యాయుల బదిలీలు, ఇలా అన్నీ ఒకేసారి జరుగుతుండడంతో గందరగోళ పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో ఎవరూ ప్రభుత్వ బడుల్లో తమ పిల్లలను చేర్పించేందుకు ముందుకురావడం లేదు. ఓ వైపు పిల్లల చేరికల కోసం ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్, మరోవైపు బదిలీలు, ఇంకోవైపు కొత్త పాఠశాలల్లో తరగతుల బోధన ఇలా తమపై కూడా ఒత్తిడి ఉందని పలువురు ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏదిఏమైనా ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల నమోదు తగ్గడానికి పూర్తి బాధ్యత ప్రభుత్వమే వహించాల్సి ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

పిల్లలెవరూ చేరని పాఠశాలలివే..

మండలంలోని జగన్నాథపురం, సోంపురం, నరసాపురం, రామభద్రపురంలోని మారుతీకాలనీ ప్రాథమిక పాఠశాలల్లో ఒకటో తరగతిలో ఒక్కరు కూడా ప్రవేశం పొందలేదు. కొండపాలవలస, మర్రివలస, కారేడువలస పాఠశాలల్లో ఒక్కొక్కరు, రామభద్రపురం హెచ్‌సీ, వైహెచ్‌సీలో ముగ్గురేసి చొప్పున మాత్రమే పిల్లలు ప్రవేశం పొందారు. ఇదిలా ఉండగా, నాయుడువలసలోని ప్రాథమికోన్నత పాఠశాలలోని ఒకటో తరగతిలో ఏడుగురు పిల్లలు ప్రవేశం పొందగా అందులో నలుగురు తిరిగి ప్రవేటు పాఠశాలలకు వెళ్లిపోతున్నట్లు సమాచారం. ఈ చిన్న గ్రామం నుంచి 100 మంది పిల్లల వరకు ప్రవేటు స్కూళ్లకు వెళ్లిపోతున్నారని స్థానికులు చెబుతున్నారు.



కొండపాలవలసలో ఒకటో తరగతి విద్యార్థినికి బోధిస్తున్న టీచర్

సంక్షోభంలో విద్యారంగం..



ప్రభుత్వం తప్పుడు నిర్ణయాలతో విద్యారంగాన్ని సంక్షోభంలోకి నెడుతోంది. స్పష్టమైన ప్రణాళిక రూపొందించడం లేదు. మే నెలలో చేయాల్సిన స్పెషల్ ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ ఇప్పుడు చేస్తున్నారు. పిల్లలంతా ప్రవేటు పాఠశాలలు, హాస్టళ్లలో చేరిపోయాక డ్రైవ్ నిర్వహిస్తే ఏం ప్రయోజనం. గతంలో పిల్లల సంఖ్యకు సరిపడ టీచర్లు ఉండేవారు.. ఇప్పుడు అలా లేరు. నాణ్యమైన బోధన ఎలా అందుతుంది? అందుకే తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల వైపు కన్నెత్తి కూడా చూడడం లేదు.

–కె.విజయగౌరి, రాష్ట్ర నాయకురాలు, యూటీఎఫ్

విద్యార్థుల నమోదుకు చర్యలు..



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ప్రణాళికతో ముందుకు వెళ్తున్నాం. గ్రామాల్లో స్పెషల్ ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నాం. ప్రతి పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచేలా ఉపాధ్యాయులు, ఎస్‌ఎంసీ సభ్యుల సమన్వయంతో కృషి చేస్తున్నాం. బడిఈడు పిల్లల తల్లిదండ్రుల వద్దకు వెళ్లి, ప్రభుత్వ పాఠశాలల్లో చదివితే వచ్చే ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తున్నాం.

–ఎ.తిరుమలప్రసాద్, ఎంఈవో, రామభద్రపురం

కళ్లకు నల్లరిబ్బన్లు కట్టుకుని నిరసన

రాజాం సిటీ: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఇంజినీరింగ్ కార్మికులు శుక్రవారం కళ్లకు నల్లరిబ్బన్లు కట్టుకుని అంబేడ్కర్ జంక్షన్ వద్ద నిరసన తెలిపారు. గడిచిన 52 రోజులుగా వివిధ రూపాల్లో పోరాటం చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం ఏమీ పట్టనట్లు వ్యవహరించడం హేయమని దుయ్యబట్టారు. ప్రభుత్వం తీరుతో చేపట్టిన సమ్మె వల్ల సాధారణ ప్రజానీకం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలు ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమని అన్నారు. తమ సాధారణమైన డిమాండ్లు పరిష్కరించే వరకు సమ్మె విరమించేదిలేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షుడు సీహెచ్ రామ్మూర్తినాయుడు, అధ్యక్ష, కార్యదర్శులు హరిబాబు, అనిల్, కృష్ణ, గణపతి, మోహన్, మరియదాసు, రామకృష్ణ, ప్రసన్న, శారద, లక్ష్మి, సోమేష్ తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ జంక్షన్ వద్ద కళ్లకు నల్లరిబ్బన్లు కట్టుకుని నిరసన తెలుపుతున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు

కృతజ్ఞతలు

బొబ్బిలి: వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా బొబ్బిలి పట్టణానికి చెందిన మాజీ మున్సిపల్ చైర్మన్ తూముల అచ్యుతవల్లి నియమితులయ్యారు. ఈ మేరకు ఆమె.. భర్త భాస్కరరావుతో కలిసి జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావును విజయనగరంలో శుక్రవారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ పదవి రావడంలో కృషి చేసినందుకు ధన్యవాదాలని, రానున్న రోజుల్లో పార్టీ మరింత బలోపేతానికి కృషి చేస్తానని ఆమె తెలిపారు.



జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అచ్యుతవల్లి

అచ్యుతరావు మృతికి మాజీ ఎమ్మెల్యే నివాళులు

బొబ్బిలిరూరల్: మండలంలోని దిబ్బగుడ్డివలస గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త వెన్నెల అచ్యుతరావు(62) గురువారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకటచినప్పలనాయుడు శుక్రవారం ఉదయం ఆ గ్రామానికి వెళ్లి, అచ్యుతరావు భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. 1983 నుంచి తన రాజకీయ ప్రస్థానంలో అన్ని కార్యక్రమాల్లోనూ పాల్గొంటూ పార్టీ విజయానికి, బలోపేతానికి దోహదపడ్డారని, అటువంటి కార్యకర్తను కోల్పోవడం చాలా బాధగా ఉందని మాజీ ఎమ్మెల్యే శంబంగి అన్నారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చారు. ఆయన వెంట మున్సిపల్ మాజీ చైర్మన్ సావు వెంకటమురళీ, సర్పంచ్ చింతల రామారావు తదితరు ఉన్నారు.



అచ్యుతరావు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి

కార్యాలయాల ఏర్పాటుకు సన్నాహాలు

బొబ్బిలిరూరల్: స్థానిక పట్టణంలో పలు ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. మండలంలోని జగన్నాథపురం సచివాలయాన్ని జెడ్పీ సీఈవో బీవీ సత్యనారాయణ, డిప్యూటీ సీఈవో ఆర్.వెంకటరమణ తదితరులు గురువారం పరిశీలించారు. సచివాలయంపై అంతస్తుపై కొత్త భవన నిర్మాణానికి చర్చలు జరిపారు. అంతవరకు సచివాలయంలో డీఎల్‌డీవో, డీపీవో, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీడీల తాత్కాలిక కార్యాలయాలు ఏర్పాటు చేశారు. కొత్త నిర్మాణాలు పూర్తయ్యేవరకు ఇక్కడి నుంచే వారంతా విధులు నిర్వహించాలని సీఈవో సత్యనారాయణ ఆదేశించారు. కార్యక్రమంలో డీడీవో కిరణ్‌కుమార్, ఎంపీడీవో పి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

సంతకవిటి: మండలంలోని గోళ్లవలస పంచాయతీ శంకరపేట గ్రామానికి చెందిన యడ్ల సూర్యనారాయణ అలియాస్ ఎమ్మార్వో ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గం ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్‌మోహన్‌రావులు మృతుడి కుటుంబాన్ని శుక్రవారం పరామర్శించారు. మృతికి గల కారణాలు అడిగి తెలుసుకుని ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ దాసరి దాలినాయుడు, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు గండ్రేటి కేసరి, తాలాడ ఎంపీటీసీ కనకల సన్యాసినాయుడు, వాసుదేవపట్నం సర్పంచ్ పప్పల గణపతి, రామారాయపురం మాజీ సర్పంచ్ యెన్ని శ్రీనివాసరావు, డాక్టర్ నరేంద్ర, యడ్ల అన్నంనాయుడు పాల్గొన్నారు.



సూర్యనారాయణ కుటుంబాన్ని పరామర్శిస్తున్న డాక్టర్ తలేరాజేష్, సిరిపురపు జగన్‌మోహన్‌రావు తదితరులు

ఘనంగా రథయాత్ర ప్రారంభం



రథాన్ని లాగుతున్న సత్యసాయి భక్తులు

రాజాం సిటీ: స్థానిక బాబానగర్‌లోని సత్యసాయి శివం మందిరంలో జగన్నాథస్వామి రథయాత్ర శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. భక్తులంతా వేకువజామునుంచే ప్రత్యేక పూజలు చేశారు. రథయాత్ర సందర్భంగా జూలై 8వ తేదీ వరకు రోజుకో కార్యక్రమం చొప్పున చేయనున్నామని మందిరం అధ్యక్షుడు కె.రాజగోపాల్ తెలిపారు. పూరీలో కొలువైన జగన్నాథుని స్మరించుకుంటూ ప్రతి ఏడాది స్థానిక మందిరంలో రథయాత్ర చేయడం ఆనవాయితీగా వస్తోందని పేర్కొన్నారు.

సమ్మె నోటీసు అందజేత

బొబ్బిలి: స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో పీవో విజయలక్ష్మికి అంగన్‌వాడీ సిబ్బంది శుక్రవారం కలిసి సమ్మె నోటీసు అందజేశారు. జూలై 9వ తేదీన జరిగే దేశవ్యాప్త సమ్మెలో పాల్గొంటున్నామని, అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, అన్ని సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

జూలై 9న శానిటేషన్ సిబ్బంది దేశవ్యాప్త సమ్మె

రాజాంసిటీ: జూలై 9న దేశవ్యాప్తంగా నిర్వహించనున్న సమ్మెలో పాల్గొంటామని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న శానిటేషన్ సిబ్బంది తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఎంఈఓ పి.ప్రవీణ్‌కుమార్‌కు సమ్మె నోటీసు అందించారు. ఈ సందర్భంగా అధ్యక్ష కార్యదర్శులు పార్వతి, సునీతలు మాట్లాడుతూ గౌరవ వేతనం రూ.10వేలు చేయాలని, బకాయిలు చెల్లించాలని, తమపై రాజకీయవేధింపులు లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. అలాగే నెలవారీ వేతనాలు సక్రమంగా చెల్లించాలని, రెండు జతల యూనిఫాం అందించాలని కోరారు. కార్మిక చట్టాలు పటిష్టంగా అమలు చేయాలని కోరుతూ జూలై 9న చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెలో అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో అరుణ, లక్ష్మి, అనూరాధ తదితరులు పాల్గొన్నారు.



ఎంఈఓకు సమ్మె నోటీసు ఇస్తున్న శానిటేషన్ సిబ్బంది

గ్రామాలు పరిశుభ్రంగా ఉంచాలి

వంగర: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని ఎంపీడీవో ఎస్.రఘునాథాచారి కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మండల పరిధిలోని అరసాడ సచివాలయాన్ని తనిఖీ చేశారు. అనంతరం గ్రామంలో గల చెత్త నుంచి సంపద కేంద్రాన్ని పరిశీలించారు. షెడ్‌కు నేమ్‌బోర్డు ఏర్పాటు చేయాలని, వర్మీకంపోస్టును విక్రయించి వచ్చిన ఆదాయాన్ని చలానా రూపంలో సాధారణ నిధులకు జమ చేయాలని సూచించారు. రక్షిత మంచినీటి పథకం చుట్టూ పిచ్చిమొక్కలు తొలగించాలని పంచాయతీ కార్యదర్శి కోటేశ్వరరావును ఆదేశించారు. అనంతరం గ్రామంలో ఇంటింటా చెత్త సేకరణను పరిశీలించారు. తడి చెత్త, పొడిచెత్త వేరువేరుగా ఇవ్వాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ లచ్చుభుక్త సత్యనారాయణ, ఈవోపీఆర్‌డీ కెల్ల రామారావు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల డిమాండ్లు పరిష్కరించాలి

రేగిడి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తరువాత గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులపై వేధింపులు ఎక్కువయ్యాయని రాజాం నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు కరణం శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం రేగిడిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగుల బదిలీలకోసం ప్రభుత్వం జారీచేసిన జీవోను సవరించి సొంతమండంలో పనిచేయడానికి అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. సీనియార్టీ, మెరిట్ ఆధారంగా బదిలీలు చేపట్టాలని కోరారు. బదిలీల్లో రాజకీయ జోక్యాన్ని నివారించి సచివాలయ ఉద్యోగులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఇటీవల సచివాలయం పరిధిలో జనాభాసంఖ్య ఆధారంగా 6 నుంచి 8 మంది చొప్పున ఉద్యోగులను శాశ్వతంగా కొనసాగించేలా తీసుకున్న నిర్ణయం ఫలితంగా రాష్ట్రంలో 72వేల మంది ఉద్యోగులు తప్పనిసరిగా బదిలీ అవుతారన్నారు. రేషనలైజేషన్ పూర్తయిన తరువాత బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత గ్రామ వలంటీర్ వ్యవస్థను రద్దుచేసి ప్రజలకు ప్రభుత్వ సేవలు దూరం చేయడమే కాకుండా ప్రస్తుతం సచివాలయ వ్యవస్థను కూడా నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో లక్ష్మీపురం సర్పంచ్ కెంబూరు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు



విలేకరులతో మాట్లాడుతున్న నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు కరణం శ్రీనివాసరావు, సర్పంచ్ వెంకటేశ్వరరావు

సంక్షిప్తంగా..

మధ్యాహ్న భోజనం తనిఖీ



మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న ఎంఈవో త్రినాధరావు

తెర్లాం: విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం రుచి, శుచి కలిగి ఉండేలా చూడాలని ఎంఈవో జె.త్రినాధరావు సూచించారు. మండలంలోని వెలగవలస గ్రామ ఫౌండేషన్ పాఠశాలను ఆయన శుక్రవారం సందర్శించి, విద్యార్థుల కోసం సిద్ధం చేసిన మధ్యాహ్న భోజనం వంటకాలను తనిఖీ చేశారు. మెనూ ప్రకారం వంటకాలు చేసి పెట్టాలని లేకుంటే చర్యలు తప్పవని వంట నిర్వాహకులకు తెలిపారు.

పనిభారం తగ్గించండి

బొబ్బిలిరూరల్: పనిభారం తగ్గించాలని పంచాయతీ కార్యదర్శులు కోరుతున్నారు. ఇదే విషయమై మండలంలోని 30 పంచాయతీలకు చెందిన కార్యదర్శులంతా మండల కేంద్రంలో ఎంపీడీవో పి.రవికుమార్‌ను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. పేస్కేల్ పెంచాలని, అదనపు పని అప్పగించకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.

దరఖాస్తు చేసుకోండి

బొబ్బిలిరూరల్: రైతులంతా సంయుక్త భూ కమతాలు(ఎల్‌పీఎం)క కోసం ఈ నెల 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దారు ఎం.శ్రీను కోరారు. ఇదే విషయమై ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ఈ నెలలో దరఖాస్తు చేసుకుంటే రూ.50లకే రిజిస్ట్రేషన్ చేయడం జరుగుతుందని, వచ్చే నెల చేసుకుంటే రూ.550 అవుతుందన్నారు. అలాగే ఇళ్లు లేని వారు ఇళ్ల కోసం సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

తడి, పొడి చెత్తలు వేర్వేరుగా ఇవ్వండి

బొబ్బిలిరూరల్: ఇంటికి వస్తున్న గ్రీన్‌అంబాసిడర్లకు తడి, పొడిచెత్తలు వేర్వేరుగా ఇవ్వాలని ఎంపీడీవో పి.రవికుమార్ సూచించారు. మండలంలోని కృష్ణాపురంలో శుక్రవారం పర్యటించిన వారు..రోడ్లు, కాలువల్లో చెత్తాచెదారం వేయొద్దని గ్రామస్తులకు సూచించారు. ఆయన వెంటన డిప్యూటీ ఎంపీడీవో అల్లు భాస్కరరావు, సర్పంచ్ సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

విత్తనాల శుద్ధిపై అవగాహన

బొబ్బిలిరూరల్: మండలంలోని అలజంగి, వెలగవలస గ్రామాల్లోని రైతులకు విత్తన శుద్ధిపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఏడీఏ మజ్జి శ్యామ్ సుందర్ మాట్లాడుతూ విత్తనాలు నాటేముందు సూడోమోనాస్ రసాయనంతో శుద్ధి చేసుకుని, వరి విత్తనాలు నాటుకుంటే నాణ్యమైన పంట, తెగుళ్లను ఎదుర్కొనే నారు తయారవుతుందన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

తెర్లాం: అధిక ధరలకు ఎరువులు, పురుగుల మందులు విక్రయిస్తే చర్యలు తీసుకునేందుకు వెనుకాడేదిలేదని ఏవో బి.శ్రీనివాసరావు హెచ్చరించారు. స్థానిక రైతు సేవా కేంద్రంలో మండలంలోని పురుగు మందులు, ఎరువుల దుకాణాల యజమానులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే సంబంధిత దుకాణదారులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైతులు కొనుగోలు చేసిన వాటికి తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని చెప్పారు. బిల్లులు ఇవ్వకపోతే కేసులు నమోదు చేస్తామన్నారు. మండలానికి అవసరమైన ఎరువులు, డీఏపీ తెప్పించేందుకు మార్క్‌ఫెడ్‌కు ప్రతిపాదనలు పంపించామన్నారు. ప్రస్తుతానికి మండలంలో 195 టన్నుల ఎరువులు ఎరువుల దుకాణాల్లో, సొసైటీలో అందుబాటులో ఉన్నాయన్నారు.

అవగాహన సదస్సు

బొబ్బిలి: స్థానిక ట్రిపుల్ ఎస్ డిగ్రీ కళాశాలలో గురజాడ అధ్యయన వేదిక ఆధ్వర్యంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులపై కూటమి ఏడాది పాలనా ప్రభావంపై అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఉన్నా అభివృద్ధి, సంక్షేమమూ శూన్యమని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ విమర్శించారు. అటు కేంద్రంలోనూ ఇటు రాష్ట్రంలోనూ ప్రభుత్వాల పాలన దారుణంగా ఉన్నాయన్నారు. ప్రజలకు ఇచ్చిన ఎన్నికల హామీలేవీ అమలు చేయడం లేదని, ఏవో అరకొరగా అమలు చేసే హామీలు పేరుతో కాలం వెల్లదీస్తున్నారని మండిపడ్డారు. ఇరు ప్రభుత్వాల వల్ల ఎవరికీ ఇంతవరకు మంచి జరిగిన దాఖలాలు లేవన్నారు. అటు ప్రజలు, ఇటు ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర నాయకురాలు కె.విజయగౌరి పాల్గొన్నారు.

సులభ పద్ధతుల్లో బోధించాలి

రేగిడి: కేజీబీవీల బోధకులు బాలికలకు బంగారు భవిత అందించేలా బోధన సాగించాలని ఎంఈఓ–2 బి.ఎరకయ్య సూచించారు. మండలంలోని దేవుదళ గ్రామంలోని కేజీబీవీను ఆయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీచేశారు. విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలపై ఆరా తీశారు. సీఆర్పీల హాజరు శాతాన్ని పరిశీలించారు. మెనూ సక్రమంగా అమలుచేయాలన్నారు. విద్యార్థులకు సలభ పద్ధతుల్లో బోధన సాగించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి.లక్ష్మి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

తక్షణమే ‘అన్నదాత సుఖీభవ’ అమలు చేయాలి

బొబ్బిలి: తక్షణమే అన్నదాత సుఖీభవ పథకం అమలు చేసి, రైతాంగాన్ని ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ మువ్వల శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ అధికారంలోకి వచ్చి రెండో ఏడాది ప్రారంభమైనా రైతులకు సంక్షేమం అందజేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. గతేడాది ఇవ్వాల్సిన బకాయితో కలిపి రైతుల ఖాతాల్లో మొత్తం నగదు జమ చేయాలన్నారు. ఇందులో ఎటువంటి కోతలు ఉండకూడదన్నారు. కౌలురైతులు, చుక్కల భూములకు సైతం పెట్టుబడి సాయం అందించాలని కోరారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం

రేగిడి: పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులను దూరం చేయవచ్చని రేగిడి పీహెచ్‌సీ వైద్యాధికారి చందక అసిరినాయుడు అన్నారు. రేగిడి, ఆమదాలవలస గ్రామాల్లో డయేరియా నిర్మూలనపై శుక్రవారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. వేడివేడి ఆహార పదార్థాలు తినాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని గ్రామస్తులకు సూచించారు. రోడ్డు పక్కన విక్రయించే ఫాస్ట్‌ఫుడ్స్‌ను తినొద్దన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ సుందరేశ్వరరావు, సూపర్ వైజర్ కేవీ అప్పారావు, హెచ్‌వీలు పుష్ప, జ్యోతి, ఎల్‌టీ రమణ, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

బొబ్బిలి: స్థానిక ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచి మేనేజర్‌గా ఈశ్వరరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు ఆయనకు సిబ్బంది ఘనస్వాగతం పలికి, శుభాకాంక్షలు తెలిపారు.

ఆప్కాస్ రద్దు చేయాలి

బొబ్బిలి: మున్సిపల్ పారిశుధ్య కార్మిక విభాగంలోని కార్మికులను తీవ్రంగా నష్టపరుస్తున్న ఆప్కాస్‌ను రద్దు చేసి, గతంలో మాదిరి ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పొట్నూరు శంకరరావు డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆయన కార్మికులతో కలిసి స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట శుక్రవారం నిరసన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు కార్మికులకు వర్తింపజేయాలని కోరారు.

రెండు పూటలా పని చేస్తే రూ.307 వేతనం

రేగిడి: ఉపాధి వేతనదారులు రెండు పూటలా పనిచేస్తే రూ.307లు వేతనం వస్తుందని ఏపీఓ ఎస్.హరనాథ్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మండలంలోని తునివాడ, వెంకంపేట, మీసాలపేట గ్రామాల్లో జరుగుతున్న ఫారంపాండ్స్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫారంపాండ్స్ పనులు చేయడం ద్వారా వేతనదారులకు కూలి గిట్టుబాటు అవుతుందన్నారు. సన్న, చిన్నకారు రైతులు ఫారంపాండ్స్‌ను ఉపాధిహామీ పథకం ద్వారా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఫారంపాండ్స్ ఏర్పాటుతో కూరగాయలతో పాటు ఎనిమిది రకాల పండ్ల మొక్కలు వేసుకోవచ్చన్నారు.

జీసీ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

రాజాం సిటీ: స్థానిక జీసీక్లబ్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ప్రత్యేక కమిటీ ద్వారా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చెలికాని బద్రిబాబు, కార్యదర్శిగా గురవాన నారాయణరావు, ఉపాధ్యక్షుడిగా పాలవలస శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పొట్నూరు సోమశేఖర్‌లు ఎన్నికయ్యారు. అలాగే కోశాధికారిగా పొట్టా సత్యనారాయణ గుప్త, డైరెక్టర్లుగా ఎం.గంగారావు, ఎస్.శ్రీనివాసరావు, జి.పాపారావు, సీహెచ్ శ్రీనివాసరావు, సీహెచ్.సునీల్, సీహెచ్.మహేశ్వరరావు, ఎస్.కేశవనాయుడు, ఎస్.మోహనరావు, ఎం.బాబ్జీ, వి.సురేష్‌లతో పాటు కో ఆప్షన్ మెంబర్లుగా పాలవలస శ్యామసుందరరావు, నల్ల రమేష్‌లను ఎన్నుకున్నారు. ఈ కార్యవర్గం రెండేళ్లపాటు కొనసాగుతుందని అధ్యక్షుడు తెలిపారు. అనంతరం తమవంతు సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలు చేయనున్నామని కార్యవర్గ సభ్యులు ప్రమాణంచేశారు.

గ్రామసభ బహిష్కరణ

బాడంగి: మండలంలోని పినపెంకి గదబవలస గ్రామంలో అధికారులు శుక్రవారం నిర్వహించిన గ్రామసభను గ్రామస్తులు బహిష్కరించారు. గ్రామ సమస్యలు పరిష్కరించని గ్రామసభలు ఎందుకని గ్రామస్తులు నిలదీశారు. ఇదివరకు జరిగిన సమావేశాల్లో తమ సమస్యలు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పరిష్కరించలేదన్నారు. వారం రోజులుగా గ్రామంలో తాగునీరు సరఫరా కావడం లేదని, వేగావతి నది నీరు తెచ్చుకుని తాగుతున్నామని వాపోయారు. ఇప్పటికైనా సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం కార్యదర్శి సురేష్ తదితరులు పాల్గొన్నారు.